# మత మౌఢ్యము

శ్రీమతి
ఎన్. అన్నపూర్ణాదేవి



ప్రభాకరరావు లలిత మధ్యాహ్నము భోజనము చేసి కులాసాగా ఆమాట యీమాట ఆడుతూ కూచున్నారు. ప్రభాకరం పేపరు చూస్తూ మధ్య మధ్య అక్కడక్కడ జరుగుచుండే సంగతులు లలితతో చెప్పుతున్నాడు. యింతలో బంట్రోతు వచ్చి టెలిగ్రాము వచ్చిందని యిచ్చి వెళ్లాడు. టెలిగ్రా మవడముతోనే కంగారుతో విప్పి చూచాడు ప్రభాకరం. అది తన గురువు వద్దనుండి. 'ధనంజయ మిల్లు ఆవరణలో హిందూ మహమ్మదీయులు కొట్లాడుకుంటున్నారు. చాల తీవ్రముగా. వెంటనే వాలంటీర్లతో వెళ్ళి వాళ్లను సమాధానము చేయుము' అని వుంది.

లలిత నవమాసములు నిండిన యువతి. యింట వేరే దిక్కులేదు. వదలిపెట్టి వెళ్లితే యేమి చిక్కువచ్చునో అనే భయం, వెళ్లకుండా వుండుటకు మనస్కరించదు. అదీగాక తన గురువువద్దనుంచి వచ్చినది ఆజ్ఞ. త్వరలో వచ్చే యేర్పాటుమీద రాత్రి బండికి ప్రయాణం నిర్ణయించాడు.

లలితకు నిముషములో ప్రొద్దు క్రుంకినది. పెందలాడే వంటచేసి యిద్దరు భోజనానికి కూర్చున్నారు. ప్రభాకరం లలితను చూచి పాపము యిటువంటి సమయములో వదలి వెళ్లుతున్నానే ఏమి అవస్త పడుతుందో అని భయము మనసులో ఉన్నప్పటికిని కనుపరచకుండ లలితకు ధైర్యము చెప్పి 'నాలుగైదు రోజులలో వస్తాను, అక్కడ ఆట్టే పని వుండదు" అని దిగులు పడవద్దన్నాడు. కాని లలిత రెండు కన్నీళ్లు కార్చింది. ఏమి దెబ్బలు తగులునో ఏమవుతుందో అన్న భయం. పాపము, మళ్లీ అంతలో ధైర్యము తెచ్చుకుని అంతమంది పోట్లాడి చచ్చిపోతుంటే వాళ్లని విడదీయుటకే కదా వెళ్లేది, అందున తన భర్తకు ఏమి అపాయముకలు[illegible] అని కండ్లు తుడుచుకున్నది. ప్రభాకరం అంతా సిద్ధము చేసుకుని బయలుదేరాడు. లలితను విడువలేక విడువలేక విడిచి, వాలంటీర్లతో వెళ్లిపోయాడు.

* * *

లలిత యింట ఒక్కతెయె కాలము గడుపుతున్నది. రేపోమాపో ప్రసవించే రోజులు; అప్పుడే ప్రభాకరం వెళ్లి నాలుగు రోజులైనది.

* * *

ప్రభాకరం వాలంటీర్లతో మిల్లు ఆవరణకు వెళ్లేసరికి యింకా హిందు మహమ్మదీయులు పెద్దగోలతో కొట్టుకొంటున్నారు. అనేకమందికి గాయములు తగిలినవి. ప్రాణాలు పోయే స్థితిలో యిద్దరు ముగ్గురున్నారు. ప్రభాకరం ఆగుంపులో చొరబడి కొట్టుకుంటున్నవాళ్లను విడదీసి, అప్పటికి కొట్లాటను చల్లార్చాడు.

వారము రోజులైనది. యింకా కొంత కాలము యిక్కడే వుండవలసినట్టున్నది. అప్పుడప్పుడు అర్ధరాత్రిళ్లు కొట్లాడు కొనుచునే యున్నారు. పాపము లలిత ఎలా ఉన్నదో! యింతవరకు ఒక్క ఉత్తరము మాత్రము వ్రాశాడు.

౨

లలిత ఆసుపత్రిలో మగబిడ్డను కన్నది. వారం రోజులైనది. సాయంత్రము యింటికి వెళ్లుతుంది. ఇన్ని రోజులుఆసుపత్రిలోఉండుటవల్ల ఆమెకు ప్రభాకరం సంగతి తెలియలేదు. యింటికి ఎప్పుడు వెళ్లి ఉత్తరాలేమైనా వచ్చిన వేమో చూడవలెనని మనసు తహతహ లాడుతూఉన్నది. లలిత యింటికి వచ్చినది; యింతవరకు భర్త రానందుకు భయంగానే ఉంది. రెండు ఉత్తరాలు వచ్చివున్నవి, అవి వెంటనే విప్పి చదివినది. ఇంకా ప్రభాకరం రాడానికి వీలు లేదు, అక్కడ యింకా కొట్లాడుకుంటున్నారు. వచ్చుటకు పదిహేను రోజులయినాపట్టును. ఉత్తరమును "నీవు సుఖముగా ప్రసవించినందుకు చాలసంతోషము. ధైర్యముగా ఉండు త్వరలో వస్తా"నని ముగించాడు. లలితకు ప్రభాకరుని క్షేమము విని కొంత మనసు కుదుటపడ్డది. పసిపిల్ల వానిని పెట్టుకొని కాలము గడపుతు ప్రభాకరం రాకకు ఎదురు చూస్తున్నది.

3

ప్రభాకరం గురువు ఆశ్రమము వద్దకు వెళ్లాడు. పరిస్థితులు చెప్పాడు "యింత మట్టుకు మళ్లీ పదిహేను రోజులనుండి కొట్లాటలేమియు లేవు. యింక నేను యింటికి వెళ్లుతాను, మీతో చెప్పి వెళ్లుదామని వచ్చా"నన్నాడు. గురువు సంతోషించి వెళ్లమని చెప్పాడు. ఆసాయంత్రమే ప్రభాకరం మిల్లు ఆవరణలోని తన వాలంటీర్ల కాంపుకు వచ్చాడు. లలిత వద్దనుండి వచ్చిన ఉత్తరము చూచుకున్నాడు. రేపే వెళ్లాలనుకున్నాడు ఏమైనను సరియె. చంటి పిల్లనితో ఏమి అవస్థపడుతున్నదో ఆలోచిస్తూ భార్యను త్వరలోనే చూచే ఉద్దేశంతో ఉత్సాహియై యున్నాడు. అతనిమనస్సు ఉరకలు వేస్తున్నది. తనలో తాను నవ్వుకొంటున్నాడు. ఇంతలో బయట గొల్లుమని గోల విన బడింది. కిటికీలోనుండి చూచాడు. మళ్లీ కొట్టుకుంటున్నారు. శిబిరమునుండి ప్రభాకరం బయటకు వచ్చాడు. కర్రలు ఎగురుతున్నవి. తిట్లు, కేకలుచెలరేగుతున్నవి. బుర్రలు పగులుతున్నవి. ప్రభాకరం గుంపులో చొరబడ్డాడు.కరములు ముగిడ్చిదొమ్మీవద్దని ప్రార్థించాడు, కాని వినేవారెవరు! ఉద్రేక మెక్కువగావుంది. ఎగిరే కర్రలలో ఒకటి అతని తలమీద వ్రాలింది. తలపగిలిన చిహ్నముగా నెత్తురు కారుతూవుంది. ప్రభాకరం ఒకమారు తలదిమ్ముతో స్పృహతప్పి పడిపోయాడు. ప్రక్కనున్న వాలంటీరు కొంచము నీళ్లు తీసుకవచ్చి ఉపచారముచేసిన వెనుక కొంచం స్పృహవచ్చినది. ప్రభాకరం తల బద్దలైంది. రక్తము వెల్లువలై పారుతున్నది. సత్తువ తగ్గిపోవుచున్నది ప్రభాకరం ప్రక్కనున్న వాలంటీరును మెల్లిగపిలచి "ఉత్తరము వ్రాయి, చెపుతాను" అన్నాడు.వాలంటీరు వడివడిగా వ్రాశాడు.

"ప్రియమైన లలితకు——నేను రేపు బయలుదేరి వస్తామని అనుకున్నాను. యింతలో యిలా నాకు అవస్థ హిందు మహమ్మదీయులు మళ్లీ కొట్లాడుకున్నారు. అప్పుడు నాతల బద్దలైనది. యింక నేను బ్రతుకను. నా కొరకు దిగులుపడకు. ఎలాగు చంటిపిల్లను పెట్టుకుని అవస్త పడుతావో నా గుండె బద్దలవుతుంది. నన్ను క్షమించు. నేను మిమ్ముల నిద్దరిని చూడలేకపోయాను" ప్రభాకరం యీ ఉత్తరము వ్రాయమని చెప్పి పూర్తి అయిన తరువాత కష్టము మీద సంతకము చేశాడు.

౪

లలిత పిల్లవాడికి పాలుపోయుచుండగా పోష్టుజవాను ఒక తంతి యిచ్చి వెళ్లాడు. లలిత పిల్లవాడికి పాలుపోయుట మాని తంతిని ఆతురతతో విప్పి చదివింది. ఒక్కమాటు దుఃఖము పట్టలేక గొల్లుమన్నది. ఆమెకు ఏమిచేయుటకు తోచలేదు. వెంటనే ఆలేగందును తీసుకొని ధనంజయ మిల్లు కాలనీకి బయలుదేరింది. కర్రయుద్ధము లయాయి, కొట్లాటలు త్రోపుళ్లు సాగుతున్నయి. పిల్లలు పిల్లలు కొట్లాడుకొంటున్నారు. లలితకు ఒకప్రక్క దుఃఖము, ఒకప్రక్క యేదో ఉద్రేకము. "నేను చేయాలి పూర్తిచేయాలి" అని మాత్రము వొకటి రెండుమారులు ఆమె పెదవులనుండి బయలువెడలింది.

లలిత తన భర్త చనిపోయినతావుకు వెళ్లింది. పసిపిల్లవాని నెత్తుకొని గుంపులోకి చొరబడింది. కొట్లాడుతున్న వారంతా నిర్ఘాంతపడి నిలిచిపోయారు. ఆమె చేతిలో లేగందువుతో కనుల అశ్రువులతో దేవీ విగ్రహములాగు కనబడింది. "మీరంతా ఎందుకిలా పోట్లాడుకుంటారు? మీరెందుకిలా పోట్లాడుకుంటారు" అనుకుంటూ ఆమె నిలువబడి పోయింది. ఒక స్త్రీ నెలరోజుల కందును ఎత్తుకు యీ గుంపులోనికి చొరబడిందంటే ఎవరి మనస్సు కరుగదు? అంతా నిర్ఘాంతపోయి కొట్లాటలు మానివేసి చూడడము మొదలుపెట్టారు. అంతా నిశ్శబ్దం. గాయపడినవారి ఊర్పులుతప్ప మరేమియు లేదు. ఆమె యేమి చెప్పనోయని అలా వుండిపోయారు. "మీరంతా ఒక్కటే. మీరంతా సోదరులు. ఎందుకీ కొట్లాటలు? మీరంతా ఒక్క మిల్లులో పని చేయుచున్నారు. మీరంతా పొట్టకూటికి కదా కష్టపడుచున్నది. హిందువులకు మహమ్మదీయులకు ఏమి భేదము? మతములని చెప్పకొంటూ కొట్లాడుకొంటారే! మతములా మీకు కూడు పెట్టుచున్నది? ఈ కొట్లాటలు దేనికి? వీటివల్ల యెంతమంది ప్రాణములు పోతున్నవి. ఎన్ని కుటుంబాలు తిండిలేక పోతున్నవి? మీకెందుకీ మతవిద్వేషాలు? మీకు మతములుకావు కూడు పెట్టేవి, మీరంతా యిలా కొట్లాడేరి, మీ కొట్లాటలు తీర్చడానికి ఉత్సాహముతో వచ్చిన నా భర్తను మీరు చంపివేశారు. ఒకరిప్రాణముల నొకరు తీసికొని శాంతికోసము వచ్చిన వారి ప్రాణములు తీసినది మీమత మాఢ్యము. కొట్లాడుకొనేది మీరు; అవస్థలు పడేది మీరు; మీ మత వైషమ్యములను అదనుగా తీసికొని ఎలుకమీద పిల్లి పిల్లిమీద యెలుకను యెక్కించి లాభాలు పొందేది యజమానులు. ఇది తెలుసుకొన్నారా? నా భర్తను మీ మూఢ వైషమ్యాలకు అర్పించాను. మీకు అప్పటికిని యదార్థము బోధకాలేదా? మీకు సాయపడని మత సంబంధమైన వెర్రి విరోధమే ప్రధానమైతే యిదిగో యీ నాపసిబిడ్డను, నన్నును నాభర్తను కొట్టిన ఆ కర్రలతోనే చంపండి. అదే కర్రలతో ముందు యీ పిల్లాడిని చంపి నన్ను చంపండి, రండి" అంటూ ఉద్రేకముతో లలిత పసిబిడ్డను పట్టుకొనినచేతులను గుంపుముందుకు చాచినది. అప్పుడు హిందూ మహమ్మదీయ కార్మికులు ఒకరి ముఖములు ఒకరు చూచుకొన్నారు. వారి కళ్లనీళ్లు ధారలుగా కారిపోయాయి. వారి హృదయాలు కదలిపోయాయి. "తల్లీ క్షమించు, మాకు యిప్పుడు అర్థమైంది. మాకు మతముకాదు కూడు పెట్టినది. మేమంతా మూఢులమై నీ భర్తను చంపి ఆ పాపము కట్టుకొన్నాము. ఇంక యింతటిమాట అనకుతల్లీ! మీమాటలు అర్థమైనవి." అని లలిత కాళ్లమీద పడ్డారు కొందరు కార్మికులు. లలిత వారిని లేవదీసి "సోదరులారా! సంతోషము యీ జ్ఞాపకార్థముగా యీ పసికందును మీ కప్పచెప్పుచున్నాను. మీరంతా ఎక్కడవున్నా సరే వైషమ్యములు లేకుండా జీవించండి. నాది మతము, యితనిదా మతము అని కీచులాడవద్దు. మీరంతా భారతీయులు. ఈ బిడ్డడు భారతీయుడు." అంటూ "ఎవరీ బిడ్డను పెంచుతారు" అని ముందునకు చాచింది. రెండు గుంపుల నుండియు యిద్దరు వృద్ధ కార్మికులు వణకుతున్న చేతులను చాచారు, "తల్లీ నాకియ్యి నేను కాపాడుతాను, నేను పెంచుతాను" అన్నారు యిద్దరును. బిడ్డను అందుకొన్నారు. ఆయిద్దరిలో ఒకడు మహమ్మదీయుడు, రెండవవాడు హిందూవు. లలిత సంతోషపడింది. ఆమె తృప్తితో "సోదరులారా, మీరు కలహాలు పెట్టుకోకూడదు. మీలో మళ్లీ ఎటువంటి కలహాలుగాని రాకుండా యీ నా పసికందును మీకు గుర్తుగా ఒప్పచెప్పతున్నాను. మీకు ఒకటే మతము, "అది ప్రేమ మతము" అంటూ లలిత పిల్లవానిని వదలలేక వదలలేక వారి చేతులలో పెట్టి ఎక్కడికో వెళ్లిపోయింది.

ధనంజయమిల్లు కార్మికులందరు పిల్లవాణ్ణి చాలా ప్రేమతో పెంచుతున్నారు. యిప్పుడు ఆ మిల్లులో పని చేసేది హిందూ మహమ్మదీయుల కారు——వారంతా భారతీయులు. కార్మికులలోయెటువంటి కలహాలును లేవు. ప్రభాకరం చనిపోయిన దగ్గర ఒక సమాధి కట్టించారు కార్మికులు తరువాత లలితను వెతుకగ ఆమె ఎక్కడను కనబడలేదు. ఏమైనదో!